## 66 ఏండ్ల కేసుపై హైకోర్టు సంచలన తీర్పు

- అస్మాన్‌జాహి వారసులు, కొనుగోలుదారుల కేసు
- లేని భూమి కోసం ఆరున్నర దశాబ్దాలుగా న్యాయపోరాటం!
- 25 గ్రామాల్లో భూవివాదాలు
- విచారణను మూసేస్తున్నట్టు హైకోర్టు వెల్లడి

హైదరాబాద్, జనవరి 16 (నమస్తే తెలంగాణ): క్షేత్రస్థాయిలో లేని భూమి కోసం అస్మాన్‌జాహి పైగా వారసులు, వారి నుంచి భూమిని కొనుగోలు చేసిన వారు గత 66 ఏండ్లుగా చేస్తున్న న్యాయ పోరాటంపై హైకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. రాజీ ద్వారా భాగ స్వామ్య పరిష్కార నిర్ణయానికి కక్షిదారులు వచ్చినా.. అసలు అక్కడ భూమే లేదని హైకోర్టు వెల్లడించింది. భూమే లేనప్పుడు భాగస్వామ్య పరిష్కారమనే అంశమే ఉత్పన్నం కాబోదని తేల్చిచెప్పింది. 25 గ్రామాల్లో భౌతికంగా ఉనికిలో లేని భూముల కోసం 1958 నుంచి ఈ లిటిగేషన్ కొనసాగుతూ వచ్చింది. కమిషనర్ ఆఫ్ సెటిల్మెంట్ సర్వే 1977లో ఇచ్చిన నివేదికను తోసిపుచ్చుతున్నట్టు హైకోర్టు వెల్లడించింది. 2022లో నియమితులైన కమిషనర్ కమ్ కోర్టు రిసీవర్ సమర్పించిన నివేదిక ప్రకారం ఆయా గ్రామాల్లో పిటిషనర్లు చెప్తున్న భూములు లేవని గుర్తుచేసింది. లేనిభూముల కోసం ఇనేండ్లుగా లిటిగేషన్ కొనసాగడంపై విస్మయాన్ని వ్యక్తంచేసింది. క్షేత్ర స్థాయిలో భూములే లేనప్పుడు కేసులో విచారణ కొనసాగింపు అవసరం లేదని వెల్లడించింది. పిటిషన్‌పై విచారణను మూసేస్తున్నట్టు న్యాయస్థానం ప్రకటించింది. 1977లో కమిషనర్ ఆఫ్ సెటిల్మెంట్ సర్వే రిపోర్టు మేరకు జారీచేసిన ఫైనల్ డిక్రీ చెల్లదని చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్‌తో కూడిన డివిజన్ బెంచ్ ఇటీవల ఈ తీర్పు వెలువరించింది.

## అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

మహబూబాబాద్ రూరల్, జనవరి 16 : మహబూబాబాద్ జిల్లాకేంద్రంలో ఓ వివాహిత హత్యకు గురైన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. సీఐ దేవేందర్ కథనం ప్రకారం.. పట్టణంలోని సిగ్నల్ కాలనీకి చెందిన భూపతి అంజయ్య ఇంట్లో నాగమణి (35), ఆమె భర్త గోపి, అత్తామామలు లక్ష్మి, రాములు, ఆడపడుచు దుర్గ అద్దెకు ఉంటున్నారు. ఆ ఇంట్లో నుంచి దుర్వాసన రావడంతో కాలనీ పెద్దలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వెళ్లి గోతిని తవ్వగా మహిళ మృతదేహం బయటపడింది. అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్టు కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు. నాగమణిని అత్త, మామ, భర్త, ఆడపడుచు కలిసి హత్య చేసి పూడ్చిపెట్టి ఉంటారని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు.

గోదావరిలో వరద ప్రవాహాలు ప్రధానంగా ప్రాణహిత, దాని దిగువన ఉన్న ఇంద్రావతి, శబరి నదుల నుంచే వచ్చి చేరుతాయి. ఆ జలాలపై కన్నేసిన ఏపీ ఇప్పుడు వాటిని మొత్తంగా జీబీ లింక్ ద్వారా తరలించేందుకు సిద్ధమైంది. అందుకు అనుగుణంగా ముందునుంచే నిబంధనలన్నీ తుంగలో తొక్కి పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులను నిర్వహిస్తున్నది. పోలవరం ప్రాజెక్టు ద్వారా రోజుకు ఒక టీఎంసీ మేరకు జలాలను తరలించేందుకు 12 క్యూసెక్కుల సామర్థ్యంతో కుడి, ఎడమ కాలువలను తవ్వాల్సి ఉన్నా అంతకు మూడింతలు సామర్థ్యంతో పనులను నిర్వహిస్తున్నది. ఒక్కో కాలువ ద్వారా రోజుకు 4 టీఎంసీల చొప్పున 8 టీఎంసీల జలాలను మళ్లించేందుకు వీలుగా పనులను చేస్తున్నది. మరోవైపు ఆయా కాలువలపై ఇప్పటికే లెక్కకు మించి ఇతర ఎత్తిపోతలను అక్రమంగా ఏర్పాటుచేసింది. ఏకంగా పోలవరం డెడ్ స్టోరేజీ నుంచి కూడా జలాలను సీమాంధ్రకు తరలించే వ్యూహంతో ముందుకు సాగుతున్నది.




ట్రిబ్యునల్ అవార్డుకు విరుద్ధంగా పోలవరం నిర్మాణ సామర్థ్యాలను ఏపీ విస్తరించింది. టీఏసీకి (టెక్నికల్ అడ్వయిజరీ కమిటీ) సమర్పించే సమయంలో డ్యామ్ ఎండీడీఎల్‌ను 145 నుంచి 141 ఫీట్లకు కుదించింది. తద్వారా లైవ్ స్టోరేజీ కెపాసిటీని 28.31 నుంచి 75 టీఎంసీలకు పెంచింది. కుడి కాలువ సామర్థ్యాన్ని 10 వేల క్యూసెక్కుల నుంచి 12 వేల క్యూసెక్కులకు, ఎడమకాలువ సామర్థ్యాన్ని 8 వేల క్యూసెక్కుల నుంచి 12 వేల క్యూసెక్కులకు పెంచింది. ఆ మేరకు టీఏసీ అనుమతులను సాధించింది. కానీ క్షేత్రస్థాయిలో ఆ సామర్థ్యాలకు విరుద్ధంగా కుడి, ఎడమ కాలువలను 17,500 క్యూసెక్కుల సామర్థ్యంతో నిర్మించడం ప్రారంభించింది. రెండు కాలువల మార్గంలో ఉన్న సొరంగాలను ఏకంగా 40 వేల క్యూసెక్కుల ప్రవాహ సామర్థ్యంతో నిర్మిస్తున్నది. నిబంధనలకు విరుద్ధంగా ఏపీ పోలవరం ప్రాజెక్టు పనులు చేపడుతున్నదని, ఈ అంశాలను ఉటంకిస్తూ బేసిన్‌లోని రాష్ట్రాలు అనేకసార్లు కేంద్రానికి ఫిర్యాదు కూడా చేశాయి. రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణ సైతం ఆయా అంశాలను ఉటంకిస్తూ కేంద్రానికి లేఖలు రాసింది.

# రోజుకు నాలుగు టీఎంసీలు

**పేరుకు 2 టీఎంసీలు.. పనులు 4 టీఎంసీలకు! ● పోలవరం కుడి, ఎడమ కాలువల ద్వారా గోదావరి నుంచి రోజుకు 8 టీఎంసీల తరలింపు**

### టీఏసీ నిబంధనలకు విరుద్ధంగా ప్రాజెక్టు నిర్మాణం
### అంతకంతకూ కాలువల సామర్థ్యం పెంపు
### మూడింతల అధిక సామర్థ్యంతో పనులు
### వాటిపై ఎక్కడపడితే అక్కడ అదనపు లిఫ్టులు
### పక్కా స్కెచ్‌తోనే పెన్నా బేసిన్‌కు 'గోదావరి' మళ్లింపు

హైదరాబాద్, జనవరి 16 (నమస్తే తెలంగాణ): సాగు, తాగు, పారిశ్రామిక అవసరాల కోసం పోలవరం ప్రాజెక్టు నిర్మించాలని 1978లో అప్పటి ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. ఈ మేరకు డీపీఆర్‌ను నాటి బచావత్ ట్రిబ్యునల్ ఎదుట సమర్పించింది. ఆ వివరాల ప్రకారం 150 ఎఫ్ఆర్ఎల్‌తో పోలవరం వద్ద డ్యామ్ నిర్మించాలి. ప్రాజెక్టు ఎండీడీఎల్ 145 అడుగులు కాగా, మొత్తం డ్యామ్ లైవ్ స్టోరేజీ 28.31 టీఎంసీలుగా ఉండాలి. డ్యామ్ నుంచి కుడి కాలువను 10 వేల క్యూసెక్కుల సామర్థ్యంతో తవ్వి గోదావరి జలాలను కృష్ణా రివర్‌కు కలపాలి. డ్యామ్ నుంచి ఎడమ కాలువను 8 వేల క్యూసెక్కుల ప్రవాహ సామర్థ్యంతో తవ్వి గోదావరి జలాలను విశాఖపట్నం వరకు తరలించాలి. ఏపీ ప్రతిపాదనలపై గోదావరి బేసిన్‌లో భాగమైన నాటి మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, ఒడిశా రాష్ట్రాలు అనేక అభ్యంతరాలు లేవనెత్తాయి. తుదకు గోదావరి నుంచి మళ్లించే జలాల్లో రైపేరియన్ రాష్ట్రాలకు వాటాలు పంచడంతోపాటు, ఇతర షరతులతో ఏపీ ప్రతిపాదనలకు బచావత్ ట్రిబ్యునల్ సూత్రప్రాయంగా ఆమోదం తెలిపింది. కానీ ఆ తర్వాత ఆచరణలో ఏపీ ప్రభుత్వం మాత్రం ట్రిబ్యునల్ అనుమతులకు విరుద్ధంగా క్షేత్రస్థాయిలో ప్రాజెక్టు, కాలువ సామర్థ్యాలను విస్తరించుకుంటూ పోతున్నది.

#### డెడ్ స్టోరేజీ నుంచి జలాలు తరలించేలా లిఫ్టులు

టీఏసీ అనుమతులకు విరుద్ధంగా పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి కాలువలు, ఇతర నిర్మాణాల సామర్థ్యాన్ని ఇష్టారాజ్యంగా పెంచుకుంటూ పోతున్న ఏపీ ప్రభుత్వం, మరోవైపు అనుమతుల్లేకుండానే అనేక లిఫ్ట్ స్కీమ్‌లను ఏర్పాటుచేస్తూ గోదావరి జలాల మళ్లింపు చేపట్టనున్నది. అపెక్స్ కౌన్సిల్, సీడబ్ల్యూసీ అనుమతులు లేకుండా, రాష్ట్ర విభజన చట్టానికి విరుద్ధంగా ఏపీ ప్రభుత్వం గోదావరిపై అక్రమంగా పలు ప్రాజెక్టులు నిర్మిస్తున్నది. పోలవరం ఎడమ కాలువపై పురుషోత్తమపట్నం లిఫ్ట్‌ను ఇప్పటికే ఏర్పాటు చేసింది.



కుడికాలువపై పోలవరం ప్రాజెక్టులో భాగంగా ఉన్న ఆయకట్టుకు నీటిని అందించేందుకు తాత్కాలికంగా పట్టిసీమ, పుష్కర లిఫ్టులను ఏర్పాటు చేస్తామని, పోలవరం డ్యామ్ అందుబాటులోకి వచ్చిన తర్వాత వాటిని తొలగిస్తామని చెప్పింది. కానీ ఆచరణలో ఆ రెండింటితోపాటు చాగల్నాడు, తొర్రిగడ్డ, తాడిపూడి, తదితర ప్రాజెక్టులను ఏర్పాటు చేసి గోదావరి జలాలను తరలిస్తున్నది. అదేవిధంగా వెంకటనగరం, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, చింతపూడి రెండో దశల ప్రాజెక్టులను కూడా చేపట్టింది. ఇదిలాఉంటే పోలవరం జలాశయం డెడ్ స్టోరేజీ నుంచి నీటిని వాడుకునేందుకు ఏపీ ప్రభుత్వం కొత్తగా పోలవరం ఎత్తిపోతల పథకం పనులను కూడా చేపట్టడం గమనార్హం. పోలవరం డ్యామ్ డెడ్ స్టోరేజీ నుంచి కూడా 18 టీఎంసీలను తరలించేందుకు వీలుగా ఈ ఎత్తిపోతల పథకాన్ని రూపొందించి పనులు నిర్వహిస్తున్నది. వీటిపై తెలంగాణ ఇప్పటికే సీడబ్ల్యూసీకి, కేంద్రానికి, గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (జీఆర్ఎంబీ)కు, పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ)కి అనేకసార్లు లేఖలు రాసింది. గతంలో పోలవరం ప్రాజెక్టు క్షేత్రపర్యటనకు వెళ్లిన కేంద్ర అధికారులు సైతం అక్రమ ప్రాజెక్టును గుర్తించడంతోపాటు, ఆ పనులు నిలిపేయాలని కూడా ఆదేశించినా ఏమాత్రం పట్టించుకోకుండా పనులు కొనసాగిస్తున్నది. పర్యావరణ అనుమతులను ఉల్లంఘించారని ఎన్జీటీ సైతం పోలవరం, చింతలపూడి, పురుషోత్తమపట్నం, పట్టిసీమ తదితర ప్రాజెక్టు పనుల మొత్తానికి రూ.248 కోట్ల జరిమానాను విధించిందంటే ఏపీ తీరును అర్థం చేసుకోవచ్చు.

#### గోదావరినే చెరబట్టే కుట్ర..

వాస్తవంగా బచావత్ ట్రిబ్యునల్ ఉమ్మడి ఏపీకి గోదావరిలో 1486 టీఎంసీలు కేటాయించింది. ఇందులో తెలంగాణ ప్రాజెక్టులకు 968 టీఎంసీలు, ఏపీ వాటా 518 టీఎంసీలని తేల్చింది. కానీ ఏపీ ప్రభుత్వం ఇప్పటికే తన వాటాకు మించి దాదాపు 776 టీఎంసీలను వినియోగించుకునేందుకు అనుమతులు లేకుండా పలు ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టింది. ఇప్పుడు అదనంగా రోజుకు 2 టీఎంసీల చొప్పున మొత్తంగా 200 టీఎంసీలను తరలిస్తామంటూ జీబీ లింక్ ప్రాజెక్టును చేపట్టేందుకు సిద్ధమైంది. కానీ వాస్తవంగా 350 టీఎంసీలతో గోదావరి-కృష్ణా-పెన్నా నదుల అనుసంధానం పనులను ఏపీ సర్కారు క్షేత్రస్థాయిలో నిర్వహిస్తున్నది. పెన్నా బేసిన్‌లో ఇప్పటికే ఆ మేరకు నీటినిల్వ సామర్థ్యం ఉండడం గమనార్హం. సోమశిల, కండలేరు, ఆవులపల్లి తదితర అనేక రిజర్వాయర్లను నిర్మించింది. పోతిరెడ్డిపాడు ద్వారా ఆయా రిజర్వాయర్లకు కృష్ణా జలాలను ఏటా అక్రమంగా మళ్లిస్తూనే ఉన్నది. ఇప్పుడు గోదావరి జలాలను కూడా ఆ మేరకు పెన్నా బేసిన్‌కు తరలించేందుకు ఏపీ వేగంగా పావులు కదుపుతున్నది. ఏపీ చర్యల ఫలితంగా గోదావరి డెల్టా సిస్టమ్ తీవ్ర ప్రభావానికి గురవుతుందని సాగునీటి రంగ నిపుణుల్లో ఆందోళన వ్యక్తమవుతున్నది. కేసీఆర్ హయాంలో ప్రాజెక్టు పనులు చేపట్టేందుకు ఏపీ వెనకడుగు వేసింది. కానీ ప్రస్తుతం మన రాష్ట్రంలో తమ అనుకూల ప్రభుత్వం రాగానే ఏపీ ఇప్పుడు మరింత దూకుడు పెంచింది. గోదావరిని చెరబట్టే పనుల్లో ముందెన్నడూ లేని వేగం పెంచింది.

### ఇప్పుడు జీబీ లింక్ పేరిట మరింత విస్తరణ

**ఇప్పటికే** టీఏసీ అనుమతులకు విరుద్ధంగా ఇష్టారాజ్యంగా కాలువలను విస్తరించుకుంటూ పోతున్న ఏపీ ప్రభుత్వం, తాజాగా గోదావరి బనకచర్ల లింక్ పేరిట ఆయా కాలువలను మరింత విస్తరించేందుకు పూనుకున్నది. పోలవరం కుడి కాలువకు సమాంతరంగా 1400 క్యూసెక్కులను తాడిపూడి కాలువను 80 కిలోమీటర్ల పొడవుతో ఇప్పటికే నిర్మించింది. ఆ కాలువను ప్రస్తుతం ప్రకాశం బరాజ్ వరకు అంటే 105 కిలోమీటర్లు పొడగించడంతోపాటు, కాలువ ప్రవాహసామర్థ్యాన్ని కూడా 1400 క్యూసెక్కుల నుంచి 10 వేల క్యూసెక్కులకు విస్తరించాలని నిర్ణయించింది. పోలవరం కుడికాలువ ప్రవాహ సామర్థ్యాన్ని కూడా 28 వేల క్యూసెక్కులతో ప్రస్తుతం చేపడుతున్నది. మొత్తంగా గోదావరి నుంచి రోజుకు నికరంగా 38 వేల క్యూసెక్కులు అంటే దాదాపు నాలుగు టీఎంసీల జలాలను తరలించే అవకాశమున్నది. ఇదీ ఏపీ ప్రభుత్వం కాగితాల మీద చెప్తున్న లెక్క. కానీ ఆచరణలో ఒక్కో కాలువ ద్వారా రోజుకు 4 టీఎంసీల చొప్పున మొత్తం 8 టీఎంసీలను తరలించే సామర్థ్యంతో పనులు చేస్తున్నది.

## అప్పుల బాధతో యువరైతు ఆత్మహత్య



పల్లె కృష్ణ (ఫైల్)

కౌడిపల్లి, జనవరి16: చేసిన అప్పు ఎలా తీర్చాలో తెలియక యువరైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన మెదక్ జిల్లా కౌడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. కౌడిపల్లి ఎస్సై రంజిత్ కుమార్‌రెడ్డి కథనం ప్రకారం.. పల్లె కృష్ణ (23) తనతండ్రి ఆరోగ్యం బాగాలేనందున చిన్నతనం నుంచి కుటుంబ బాధ్యతలు మోస్తున్నాడు. అక్క పెండ్లికి తెలిసినవారి దగ్గర అప్పు చేశాడు. ఆ అప్పు తీర్చడానికి తనకున్న 1.02 ఎకరాల పొలంలో వ్యవసాయం చేయడానికి బోరు వేయించాడు. అది ఫెయిల్ కావడంతోపాటు పంటదిగుబడి ఆశించినంతగా రాలేదు. ప్రభుత్వ సాయమూ అందలేదు. దీంతో రూ.4లక్షల అప్పు ఎలా తీర్చాలో తెలియక తీవ్ర మనస్తాపం చెంది గురువారం అడివిలోకి వెళ్లి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి భిక్షపతి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.



బ్యాంకు ఎదుట ఆందోళన చేస్తున్న రైతు మల్లేశ్

## బాకీ కింద ధాన్యం డబ్బులు జమ

- సహకార బ్యాంకు ఎదుట రైతు ఆత్మహత్యాయత్నం

ధర్మపురి, జనవరి 16: జగిత్యాల జిల్లా ధర్మపురిలోని కేడీసీసీబీ ఎదుట ఓ రైతు ఆత్మహత్యాయత్నం చేశాడు. బుగ్గారం మండలం మద్దునూర్‌కు చెందిన సోమ రాజమల్లు నాలుగెకరాల భూమి ఉంది. తన పట్టా పాసుబుక్ బ్యాంక్‌లో పెట్టి రెండేళ్ల క్రితం రూ.4లక్షల మార్టిగేజ్ రుణం తీసుకున్నాడు. కొన్ని నెలలకే రాజమల్లు మృతిచెందడంతో రెండెకరాల భూమి కొడుకు మల్లేశ్, మిగిలిన రెండెకరాలు భార్య శంకరమ్మకు విరాసత్ అయింది. బ్యాంకులో ఉన్న రుణాన్ని మల్లేశ్ వాయిదాల పద్ధతిలో ఆరు నెలలకు ఒకసారి రూ.56వేలు చెల్లిస్తున్నాడు. ఇటీవల వానకాలం పంటకు సంబంధించి ధాన్యం విక్రయించగా, అందుకు సంబంధించిన డబ్బులు రూ.3లక్షలు అదే బ్యాంకులోని శంకరమ్మ ఖాతాలో జమయ్యాయి. రుణం ఇంకా రూ.2.90 లక్షలు ఉండగా, శంకరమ్మ ఖాతా నుంచి పూర్తిగా కట్ చేయడంతో మల్లేశ్ కలత చెంది గురువారం బ్యాంకు వద్దకు వెళ్లాడు. ధాన్యం డబ్బులు ఇవ్వకుంటే పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం చేసుకుంటానని ఆందోళన చేశాడు. అధికారుల సమాచారం మేరకు కానిస్టేబుల్ అక్కడి చేరుకోగా, అప్పటికే మల్లేశ్ ఒంటిపై పెట్రోల్ పోసుకొని అగ్గిపెట్టెతో అంటించుకునేయత్నం చేశాడు. కానిస్టేబుల్ అడ్డుకోవడంతో ప్రమాదం తప్పింది. ఈ విషయమై బ్యాంక్ ఫీల్డ్ అధికారి ప్రవీణ్‌ను వివరణ కోరగా, అకౌంట్‌లో జమైన రూ.3లక్షల్లో నుంచి ప్రస్తుతం కట్టాల్సిన ఇన్‌స్టాల్ మెంట్ 56 వేలు మాత్రమే కట్ చేసుకొని, మిగతా ఇస్తామని చెప్పామని, ఇందుకు తల్లీకొడుకులు అంగీకరించి సంతకం కూడా చేశారని చెప్పారు. ఆధార్ జిరాక్స్ తీసుకువస్తామని వెళ్లి, కొంతసేపటికే ఇలా బ్యాంకు వద్దకు వచ్చి డబ్బులు మొత్తం కావాలని గొడవకు దిగారని వెల్లడించారు.

# హైదరాబాద్‌లో దొంగల కాల్పులు

- బీదర్‌లో ఏటీఎం నగదు చోరీ, హైదరాబాద్‌కు పరారీ
- హైదరాబాద్ నుంచి రాయచూర్ వెళ్లేందుకు యత్నం
- నగదు గుర్తించిన బస్సు డ్రైవర్‌పై కాల్పులు
- ఒకరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు



హైదరాబాద్‌లోని అఫ్జల్‌గంజ్‌లో ట్రావెల్స్ మినీబస్సును తనిఖీ చేస్తున్న పోలీసులు

హైదరాబాద్ సిటీబ్యూరో/సుల్తాన్‌బజార్/జహీరాబాద్, జనవరి 16 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ అఫ్జల్‌గంజ్‌లో బీదర్‌కు చెందిన ఇద్దరు దొంగలు తుపాకీతో కాల్పులు జరిపి బీభత్సం సృష్టించారు. కాల్పుల్లో గాయపడ్డ బస్సు డ్రైవర్ దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. బీదర్‌లోని శివాజీ చౌక్‌లో గురువారం ఉదయం ఏటీఎం కేంద్రంలో నగదు డిపాజిట్ చేసేందుకు వెళ్తున్న సెక్యూరిటి సిబ్బందిపై ఇద్దరు దుండగులు తుపాకీతో కాల్పులు జరిపి, వారి దగ్గర నుంచి రూ.93 లక్షలు లాక్కుని పరారయ్యారు. కాల్పుల్లో ఓ సెక్యూరిటీ గార్డు, మరో వ్యక్తి మృతి చెందారు. అక్కడి నుంచి మధ్యాహ్నం 3:30 గంటలకు హైదరాబాద్ వచ్చిన దుండగులు 3 గంటల పాటు అఫ్జల్‌గంజ్‌లో తలదాచుకున్నారు. రాయచూర్ వెళ్లేందుకు టికెట్లు బుక్ చేసుకున్నారు. రాత్రి 7 గంటలకు ట్రావెల్స్ బస్ బోయిన్‌పల్లి నుంచి బయల్దేరాల్సి ఉంది. ఈ నేపథ్యంలో అఫ్జల్‌గంజ్ నుంచి సాయంత్రం 6 గంటలకు ట్రావెల్స్ మినీబస్సులో ఎక్కారు. ఈ క్రమంలో బ్యాగును పైన పెట్టేందుకు బస్ డ్రైవర్ ప్రయత్నించాడు. బ్యాగు చాలా బరువుగా ఉండటంతో అనుమానం వచ్చి చూడగా అందులో నగదు గుర్తించాడు. ఇంతలో ఇద్దరు దొంగల్లో ఒకడు తన దగ్గర ఉన్న గన్ తీసుకుని కాల్పులు జరిపాడు. ఆ తర్వాత వారిలో ఒకరు పోలీసులకు పట్టుబడినట్టు సమాచారం. మరో వ్యక్తిని పట్టుకునేందుకు బీదర్‌తో పాటు రాష్ట్ర పోలీసులు ప్రత్యేక బృందాలతో గాలింపు చేస్తున్నారు.

## వచ్చే నెలలో 'గోద్రా' అప్పీళ్ల విచారణ

న్యూఢిల్లీ: గుజరాత్‌లోని గోద్రాలో రైలు బోగీని తగులబెట్టిన కేసులో అప్పీళ్లపై వచ్చే నెల 13న విచారణ జరుపుతామని సుప్రీంకోర్టు గురువారం తెలిపింది. 2002 ఫిబ్రవరి 27న గోద్రాలో సబర్మతి ఎక్స్‌ప్రెస్ ఎస్-6 బోగీని కొందరు దుండగులు తగులబెట్టడంతో 59 మంది ప్రాణాలు కోల్పోయారు. కింది కోర్టు తీర్పును హైకోర్టు 2017 అక్టోబరులో సమర్థించింది. కొందరికి విధించిన మరణ శిక్షను జీవిత ఖైదుగా మార్చింది. దీనిపై గుజరాత్ ప్రభుత్వం, కొందరు దోషులు ఈ అప్పీళ్లను దాఖలు చేశారు.

# షిర్డీకి వెళ్తుండగా రోడ్డు ప్రమాదం

**అదుపుతప్పి బోల్తాపడిన బస్సు ● యాదాద్రి, జనగామ జిల్లాలకు చెందిన నలుగురు దుర్మరణం**



ప్రేమలత, ప్రసన్నలక్ష్మి, అక్షిత, వైద్విత్ (ఫైల్)

మోత్కూరు, జనవరి16: మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని కొండగడపకు చెందిన నలుగురు మృతి చెందారు. మరో నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన శ్యాంశెట్టి కృష్ణమూర్తి హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లోని గ్రీన్‌పార్క్ సమీపంలో నివాసం ఉంటున్నారు. వీరు దైవదర్శనం కోసం ఈ నెల 12న బంధువులతో కలిసి కలిసి షిర్డీకి బయలుదేరారు. బుధవారం రాత్రి నాసిక్‌కు వెళ్లడం కోసం ఓ మినీ బస్సు అద్దెకు తీసుకున్నారు. గురువారం ఔరంగాబాద్ వద్ద ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను ఓవర్ టేక్ చేస్తుండగా బస్సు అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో కృష్ణమూర్తి భార్య ప్రేమలత (55), కుమార్తె తొలుపునూరి ప్రసన్నలక్ష్మి (45), మనుమరాలు తొలుపునూరి అక్షిత (22), మనుమడు వైద్విత్( 6నెలలు) మృతి చెందారు. కృష్ణమూర్తి, అతని అల్లుడు తొలుపునూరి శ్రీనివాస్‌తో పాటు మరో ఇద్దరికి గాయాలయ్యాయి.

# ఇంజినీరింగ్ విద్యార్థినిపై లైంగికదాడి

**ప్రైవేట్ వసతిగృహంలో దారుణం ● యువతిని చెరబట్టిన రియల్‌ఎస్టేట్ వ్యాపారి కారు డ్రైవర్**

ఇబ్రహీంపట్నంరూరల్, జనవరి 16 : ఉన్నత చదువుల కోసం ప్రైవేట్ వసతిగృహంలో ఉంటున్న ఇంజినీరింగ్ విద్యార్థినిపై కన్నేసిన ఓ కామాంధుడు.. మద్యం మత్తులో ఆమెపై లైంగిదాడికి పాల్పడ్డాడు. హాస్టల్‌లో ఒంటరిగా ఉండటాన్ని అదునుగా చేసుకొని అఘాయిత్యానికి ఒడిగట్టాడు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం పరిధిలోని మంగల్‌పల్లి సమీపంలో ఉన్న ఓ హాస్టల్‌లో బుధవారం రాత్రి ఈ ఘటన జరుగగా ఆలస్యంగా వెలుగుచూసింది. పోలీసుల వివరాల ప్రకారం.. మంగల్‌పల్లి సమీపంలోని హాస్టల్‌లో ఉంటూ ఓ విద్యార్థిని స్థానిక కళాశాలలో ఇంజినీరింగ్ చదువుతున్నది. అదే భవనం గ్రౌండ్ ఫ్లోర్‌లో ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారికి చెందిన కార్యాలయం ఉన్నది. రియల్ ఎస్టేట్ వ్యాపారి వద్ద నల్లగొండ జిల్లా గుర్రంపోడ్ మండలం జొన్నాయిచింత గ్రామానికి చెందిన అజిత్ (22) డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సంక్రాంతి పండుగ సందర్భంగా హాస్టల్ భవనం పైఅంతస్తులోని గదిలో పలువురితో కలిసి అజిత్ దావత్ చేసుకున్నాడు. సదరు విద్యార్థిని, బుధవారం రాత్రి హాస్టల్ మొదటి అంతస్తులో ఒంటరిగా కనిపించడం చూసి బలవంతంగా గదిలోకి ఎత్తుకెళ్లి లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనపై డయల్ 100 ద్వారా పోలీసులకు సమాచారం అందడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని నిందితుడిపై కేసు నమోదు చేసినట్టు ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు తెలిపారు.

## వాటా తేలుస్తాం!

మొదటిపేజీ తరువాయి...

విచారణ జరుపుతామని తేల్చిచెప్పింది. రెండు అంశాలను ఒకేసారి విచారించి, ఉత్తర్వులు జారీ చేస్తే కొత్త సమస్యలు వచ్చే అవకాశం ఉన్నదని పేర్కొన్నది. సెక్షన్-3లోని 'ఫర్దర్ టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్'ను కొట్టివేయాలని ఏపీ ఇప్పటికే సుప్రీంకోర్టుకు వెళ్లిందని గుర్తుచేసింది. ఏపీకి అనుకూలంగా సర్వోన్నత న్యాయస్థానం తీర్పు ఇస్తే ట్రిబ్యునల్ గుర్తించిన అంశాలు, ఉత్తర్వులకు పొంతన ఉండకపోవచ్చని పేర్కొన్నది. కాబట్టి ముందుగా తెలంగాణ చెప్తున్న ప్రకారం సెక్షన్-3పై వాదనలు వింటామని, ఆ తర్వాత అవసరాన్ని బట్టి సెక్షన్-89పై వాదనలు కొనసాగిస్తామని ట్రిబ్యునల్ స్పష్టం చేసింది.

#### మొదటినుంచీ బలమైన వాదనలు..

కృష్ణా జలాల్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు బచావత్ ట్రిబ్యునల్ 811 టీఎంసీలను కేటాయించింది. 2014లో రాష్ట్ర విభజన అనంతరం తెలంగాణకు 299 టీఎంసీలు, ఏపీకి 512 టీఎంసీల నీటిని కేటాయించారు. అయితే కేసీఆర్ ప్రభుత్వం ఈ కేటాయింపులపై అభ్యంతరం వ్యక్తం చేసింది. ముందుగా జలాల్లో తెలంగాణ వాటా తేల్చాలని డిమాండ్ చేసింది. అయినా పట్టించుకోకుండా ఏపీ పునర్విభజన చట్టం 2014లోని సెక్షన్-89 ప్రకారం ముందుగా తెలుగు రాష్ట్రాల మధ్య ప్రాజెక్టులవారీగా మాత్రమే నీటిని కేటాయించాలని కేంద్ర ప్రభుత్వం గతంలో బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్‌కు మార్గదర్శకాలను జారీ చేసింది. దీంతో తెలంగాణకు ఒరిగేదేమీ లేదని, అంతర్రాష్ట్ర జలవివాదాల చట్టం 1956లోని సెక్షన్-3 ప్రకారం ట్రిబ్యునల్‌కు విచారణ చేసే అధికారం కల్పించాలని బీఆర్ఎస్ ప్రభుత్వం సుదీర్ఘ పోరాటం చేసింది. కేసీఆర్ అవిశ్రాంత కృషి, తెలంగాణ ప్రభుత్వ అలుపెరగని పోరాటం ఫలితంగా ఎట్టకేలకు కేంద్రం దిగివచ్చింది. సెక్షన్-3 కింద కృష్ణా జలాలను పంపిణీ చేయాలని గతేడాది అక్టోబర్‌లో నూతన మార్గదర్శకాలను జారీచేసింది. ఉమ్మడి ఏపీకి కేటాయించిన జలాలను రెండు రాష్ట్రాల మధ్య పునఃపంపిణీ చేయాలని, గోదావరి డైవర్షన్ ద్వారా వచ్చే 45 టీఎంసీల అంశాన్ని కూడా తేల్చాలని ట్రిబ్యునల్‌కు సిఫారసు చేసింది. ఈ మేరకు బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ విచారణ ప్రారంభించింది.